

పది గట్టెక్కేదెలా?

- మరో మూడు నెలల్లో పరీక్షలు.. ఉపాధ్యాయులే లేరు!
- మెదక్ జిల్లాలో 146 ఉన్నత పాఠశాలలు
- 1,709 పోస్టులకు 265 ఖాళీ
- చదువులకు ఆటంకం
- ఫలితాలపై ప్రభావం చూపుతుందని ఆందోళన

7లో



సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వి.క్రాంతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరు క్రాంతి

విద్య, వైద్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 4: సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన వల్లూరు క్రాంతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఉదయం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బాధ్యతల నుంచి రిలీవ్ అయిన ఆమె మధ్యాహ్నం సంగారెడ్డికి చేరుకుని కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్యలున్నా త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని క్రాంతి తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజాపాలన ద్వారా ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని తెలియజేశారు.



ఐడీఎస్‌ఎంటీ కోసం కేటాయించిన స్థలం

ఎన్నాళ్లీ నిరీక్షణ!

- కొలిక్కిరాని జహీరాబాద్ ఐడీఎస్‌ఎంటీ ప్లాట్ల పంచాయితీ
- హామీలు, ప్రతిపాదనలకే పరిమితం
- 101 ఎకరాల్లో 1,294 ప్లాట్లు
- 1982లో ఏర్పాటు.. 1987 నుంచి 2009 వరకు మున్సిపాలిటీలో రిజిస్ట్రేషన్లు
- అనర్హులకు కేటాయించారని 2009లో కోర్టు కేసు
- చర్యలు తీసుకోవాలని 2013లో న్యాయస్థానం ఆదేశాలు
- నాటి నుంచి పెండింగ్‌లోనే..
- ఇప్పటికే 300 ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం

జహీరాబాద్ పట్టణంలో ఐడీఎస్‌ఎంటీ (చిన్న, మధ్య తరహా పట్టణ సమగ్రాభివృద్ధి పథకం) కాలనీలో ప్లాట్ల కేటాయింపు పంచాయితీ దశాబ్దాలుగా కొలిక్కిరావడం లేదు. ఎప్పటికప్పుడు నాయకులు, అధికారులు హామీలతో కాలం వెల్లదీయడమే తప్ప.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. 1982లో అప్పటి ప్రభుత్వం 101 ఎకరాల్లో హెచ్‌ఐజీ, ఎంఐజీ, ఎల్‌ఐజీ, ఈడబ్ల్యూఎస్ విభాగాల్లో 1,294 ప్లాట్లను చేసింది. 1987లో పంపిణీ ప్రక్రియను ప్రారంభించి ఏటా కొన్ని రిజిస్ట్రేషన్లు చేశారు. అనర్హులకు కేటాయించారని 2009లో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కేటాయింపు ఆగిపోయింది. దీనిపై విచారించిన న్యాయస్థానం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ 2013లో తీర్పు వెలువరించింది. కానీ అప్పటి నుంచి ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని ఎటూ తేల్చకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఇప్పటికే 300 మంది ఇళ్లను నిర్మించుకున్నారు.

7లో



ఐడీఎస్‌ఎంటీ కాలనీలోని బోర్డు



రేపు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో

ముత్యాల ముగ్గుల పోటీ

- మెదక్ జిల్లా గూడూరు, శివ్వంపేటలో నిర్వహణ
- యువతులు, మహిళలందరికీ ఆహ్వానం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, జనవరి 4: సంక్రాంతి సందర్భంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో ఈ నెల 6న శనివారం మెదక్ జిల్లా గూడూరు, శివ్వంపేటలో జరుగనున్నాయి. ఈ పోటీలకు స్థానిక స్పాన్సర్‌గా శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు జిన్నారం పెద్దగౌని శివకుమార్‌గౌడ్ వ్యవహరిస్తున్నారు. మహిళలు ఉదయం 9 గంటల వరకు వేదిక వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో విజేతకు మొదటి బహుమతి రూ. 6వేలు, రెండో బహుమతి రూ. 4 వేలు, మూడో బహుమతి రూ. 3 వేలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ రిటర్న్‌గిఫ్ట్ ఇవ్వనున్నారు.

నిబంధనలు..

- ముగ్గుల పోటీల్లో మహిళలు మాత్రమే పాల్గొనాలి.
- చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి.
- ఎన్ని చుక్కలు.. ఎన్ని వరుసలో చెప్పగలిగేలా ఉండాలి.
- ముగ్గు పిండి, రంగులు.. తదితర సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలి.
- ముగ్గు వేయడానికి 2 గంటల సమయం ఇస్తారు.
- **మిగతా వివరాల కోసం ముగ్గుల పోటీకి సంబంధించిన ప్రకటనను చూడొచ్చు.**

నామినేటెడ్ పదవులు ఎవరికో?

- సంక్రాంతి లోపు భర్తీ చేస్తామన్న సీఎం
- కాంగ్రెస్‌లో పలువురు ఆశావహులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 4: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. సంక్రాంతి లోపు భర్తీ చేస్తామని పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించడంతో ఆశావహుల్లో ఉత్సాహం నెలకొన్నది. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు రెండేసి చొప్పున రాజ్యసభ, శాసనమండలి స్థానాలను భర్తీ చేయాల్సి ఉన్నది. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసినవారికి, కష్టకాలంలో పార్టీని కాపాడినవారికి, ఎన్నికల్లో ఓడిన ముఖ్య నాయకులకు పదవుల కేటాయింపులో ప్రాధాన్యం ఉంటుందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో భాగంగా శాసనమండలి సభ్యత్వానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి పేరు పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. పార్టీ ఇబ్బందుల్లో ఉన్న పరిస్థితుల్లోనూ సంగారెడ్డిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సభ నిర్వహించడమే కాకుండా సక్సెస్ చేసి అందరి దృష్టిలోకి వచ్చారు. ఇటీవల ఎన్నికల ప్రచార సమయంలోనూ సంగారెడ్డిలో జరిగిన సభలో జగ్గారెడ్డిని గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తారని అప్పట్లో పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆశీస్సులు మెండుగా ఉన్న జగ్గారెడ్డికి శాసనమండలి సభ్యత్వం దక్కవచ్చన్న ప్రచారం పార్టీ వర్గాల్లో ఉన్నది. ఇక ఆయా పదవుల్లో ఇటీవల ఎన్నికల్లో ఓడిన మాజీ మంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్(జహీరాబాద్), కాటా శ్రీనివాస్‌గౌడ్(పటాన్‌చెరు) పేర్లు ప్రముఖంగా వినవస్తున్నాయి. అందోలు నియోజకవర్గానికి చెందిన మాజీ స్కోర్ చైర్మన్ పి.సంగమేశ్వర్ కూడా కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఆయన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహ ద్వారా ప్రయత్నిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో తన గ్రామానికి చెందిన ఆ పార్టీ నాయకుడు భిక్షపతికి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చిన విషయాన్ని సంగమేశ్వర్ గుర్తుచేస్తూ ఈసారి తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇక జహీరాబాద్ ఎంపీపీ అధ్యక్షుడిగా ఉన్న గిరిధర్‌రెడ్డి కూడా కార్పొరేషన్ చైర్మన్ పదవి రేసులో ఉన్నట్టు ప్రచారంలో ఉన్నది. ఆయన ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తోడల్లుడు కావడం కలిసి వచ్చే అంశమని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. వీరిలో ఎవరెవరికి అవకాశం కల్పిస్తారోననే ఆసక్తి నెలకొన్నది.





రాజీనామా చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మురళీధర్‌యాదవ్

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్ రాజీనామా

- అవిశ్వాస తీర్మానం ఇచ్చిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- ముందుగానే తప్పుకున్న చైర్మన్

నర్సాపూర్, జనవరి 4: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్ రాజీనామా చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు గురువారం తన రాజీనామా లేఖను అందజేశారు. బీఆర్‌ఎస్ తరఫున 13వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొంది చైర్మన్‌గా ఎంపికైన మురళీధర్‌యాదవ్ ఏడాది క్రితం బీజేపీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా బరిలో నిలిచి ఓడిపోయారు. చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఇటీవల బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు తీర్మానం అందజేశారు. బీజేపీకి ఆరుగురు కౌన్సిలర్లు ఉండగా.. బీఆర్‌ఎస్ వైపు 9 మంది ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే పదవి పోవడం ఖాయం కావడంతో ముందుగానే రాజీనామా చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధిని పట్టించుకోకుండా పదవుల కోసం పాకులాడడం సిగ్గుచేటన్నారు. గత ప్రభుత్వం నర్సాపూర్ పట్టణ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. పదవిలో లేకున్నా ప్రజల మధ్యనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు సురేష్, రాజేందర్, బుచ్చేష్, యాదగిరి, లత రమేష్ తదితరులు పాల్గొన్నారు.



(ఫైల్)

సంగారెడ్డి జిల్లాలో ధాన్యం

కొనుగోలు కేంద్రాల మూసివేత


- 1,76,343 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- 697 మంది రైతులకు రూ.6.95 కోట్ల బకాయి
- బహిరంగ మార్కెట్‌కు లక్ష మెట్రిక్ టన్నుల వడ్లు!

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 4: వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా యంత్రాంగం గురువారం మూసివేసింది. వరి కోతలు మొదలైన అక్టోబరులోనే జిల్లా యంత్రాంగం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రెండు నెలలపాటు రైతుల నుంచి ధాన్యం సేకరణ ప్రక్రియను కొనసాగించిన యంత్రాగం వడ్లు రావడం నిలిచిపోవడంతో కేంద్రాలను మూసేసింది. జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో 198 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ధాన్యం దిగుబడి రావడాన్ని బట్టి అక్టోబరు, నవంబరు రెండో వారం వరకు ఈ కేంద్రాలన్నీ ఏర్పాటయ్యాయి. ఆయా కేంద్రాలలో 33,317 మంది రైతులు 1,76,343.8 మెట్రిక్ టన్నుల వడ్లను విక్రయించారు. ఇప్పటివరకు 32,620 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.381.54 కోట్లను జమ చేసింది. ఇంకా 697 మంది రైతులకు రూ.6.95 కోట్లు చెల్లించాల్సి ఉన్నది.

బహిరంగ మార్కెట్‌కు లక్ష టన్నుల వడ్లు

బహిరంగ మార్కెట్‌లో ధాన్యం క్వింటాలు ధర రూ.2,400 నుంచి రూ.2,500 వరకు ఉన్నది. దీంతో జిల్లాలో రైతులు లక్ష మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం నేరుగా రైస్‌మిల్లులకు విక్రయించినట్టు తెలుస్తున్నది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1,14,222 మంది రైతులు 1,51,359 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 3,67,440 మెట్రిక్ టన్ను ధాన్యం దిగుబడి వస్తుందని, ఇందులో 2,93,950 మెట్రిక్ టన్ను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. ఈ మేరకు 198 కేంద్రాలను ఏర్పాటు చేసి, సుమారు రెండు నెలలపాటు సేకరణ కొనసాగించారు. అయినా 1,76,343.8 మెట్రిక్ టన్నుల వడ్లు మాత్రమే కేంద్రాలకు వచ్చింది. మిగిలిన 1,17,607 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించినట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా రైస్‌మిల్లర్లు క్వింటాలుకు రూ.300 వరకు ఎక్కువ చెల్లించడంతోనే రైతులు మార్కెట్‌లో విక్రయించినట్టు భావిస్తున్నామని అధికార వర్గాలు తెలిపాయి. పంటలు సాగు కోసం ప్రభుత్వం రైతుబంధు సాయం చేసినా మిగిలిన పెట్టుబడి కోసం అవసరమైన డబ్బులను మిల్లర్లు అప్పు ఇవ్వడంతో కొందరు రైతులు వారికే తమ ధాన్యాన్ని విక్రయించినట్టు తెలుస్తున్నది.





వైద్యసేవలను ప్రజలకు చేరువ చేయాలి



పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కాశీనాథ్

గజ్వేల్, జనవరి 4: వైద్యసేవలను ప్రజలకు చేరువ చేయడంలో నిర్లక్ష్యం వహించవద్దని సిద్దిపేట జిల్లా వైద్యాధికారి జూలూరి కాశీనాథ్ అన్నారు. గజ్వేల్ డివిజన్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాసేవలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. వారితో జిల్లా అధ్యక్షుడు కాలువ చక్రధర్, ప్రధాన కార్యదర్శి చెరుకు భాస్కర్, ఉపాధ్యక్షుడు భూంపల్లి రాజు, గజ్వేల్ డివిజన్ అధ్యక్షుడు ఆదిమూలం నారాయణ, ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, ట్రెజరర్ మంగమ్మ, జాయింట్ సెక్రెటరీ సురేశ్‌కుమార్, నాగరాజు, ప్రభాకర్, సలహాదారు శ్రీనివాస్, మల్లేశం ఉన్నారు.

డీఎస్సీ కల నెరవేరేనా!?

- నిరీక్షిస్తున్న అభ్యర్థులు
- జిల్లాలో ఖాళీగా 911 టీచర్ పోస్టులు
- మెగా డీఎస్సీపై ఇటీవల సీఎం ప్రకటన



సంగారెడ్డిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సంగారెడ్డి అర్బన్, జనవరి 4 : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవల విద్యాశాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించారు. 2017లో నిర్వహించిన టీఆర్టీ అనంతరం గతేడాది మరోసారి అప్పటి ప్రభుత్వం టీఆర్టీ నిర్వహించేందుకు చేసిన కసరత్తు ఫలించకపోవడంతో అభ్యర్థులు నిరాశచెందారు. తాజాగా నూతన ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంసిద్ధత వ్యక్తం చేయడంతో నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 2017లో టీఆర్‌టీ నిర్వహించినా నియామకాలు చేపట్టకపోవడంతో అభ్యర్థులు నిరుత్సాహంలో పడిపోయారు. పోయిన ఏడాది సెప్టెంబరులో ఉపాధ్యాయ బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించడంతో నిరుద్యోగుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఆ ప్రక్రియ అనంతరం నియామకాలు చేపడతారని భావించారు. కానీ కోర్టు కేసు కారణంగా ఆ నియామకాలు ఆగిపోయాయి. కోర్టులో ఆ కేసు వాయిదా పడుతుండటం, ఎన్నికలు రావడంతో బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. ఇలా ఉండగా 2022 జూన్ 12న టెట్ పరీక్ష నిర్వహించారు. ఫస్ట్ పేపర్‌కు 16791 మంది హాజరుకాగా, 4796 (30.88 శాతం) మంది అర్హత సాధించారు. సెకండ్ పేపర్‌కు 12359 మంది హాజరుకాగా, 5086 (44.85 శాతం) మంది అర్హత సాధించారు. కాగా 2023- సెప్టెంబరు 15న మళ్లీ టెట్ పరీక్ష నిర్వహించగా, 23,266 మంది పరీక్ష రాశారు. ఇందులో పేపర్-1 పరీక్షను 11535 మంది రాయగా, 4169(36.14 శాతం) మంది అర్హత సాధించారు. పేపర్-2(మాథ్స్ అండ్ సైన్స్) 4592 మంది రాయగా, 846 (18.42 శాతం) మంది అర్హత సాధించారు. సోషల్ సబ్జెక్టు పరీక్షకు 3228 మంది హాజరుకాగా, 269 (8.33శాతం) మంది అర్హత సాధించారు. అయితే గత ప్రభుత్వం టెట్ నిర్వహణ కన్నా ముందు టీఆర్టీ నిర్వహించేందుకు ప్రకటన జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లాలో 283 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. పోస్టులు తక్కువగా చూపి, భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడంతో అభ్యర్థులు నిరాశకు లోనయ్యారు. అయితే దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుండగానే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

ఖాళీగా 911 టీచర్ పోస్టులు

సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో 911 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో ఎస్జీటీలు 385 (ప్రభుత్వ-48, జడ్పీ-337). స్కూల్ అసిస్టెంట్ 372 పోస్టులు(ప్రభుత్వ-29, జడ్పీ-343)ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా లాంగ్వేజ్ పండింట్ పోస్టులు 24 (ప్రభుత్వ-4, జడ్పీ-20), పీఈటీ-5, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, ఆర్ట్, డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్, రిసోర్ట్ టీచర్లు కలిపి మొత్తం 60 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవే కాకుండా గెజిటెడ్ హెచ్‌ఎం గ్రేడ్-2 పోస్టులు 65 ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉన్నది. ఖాళీ పోస్టుల్లో 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా, 30 శాతం నేరుగా నియమించాలనే నిబంధన ఉంది. కాగా మార్చి నెలాఖరులో ఉద్యోగ విరమణతో ఏర్పడనున్న ఖాళీలతో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

సీఎం ప్రకటనపైనే అభ్యర్థుల ఆశలు

జిల్లాలో 1247 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 1.25 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత వల్ల బోధనకు ఆటంకం కలగడంతో పాటు విద్యాశాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవడం, పలు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడడంతో ఈ ఏడాది కూడా సుమారు 150 మంది టీచర్లను డిప్యుటేషన్‌పై ఇతర పాఠశాలల నుంచి లేనిచోటకు తాత్కాలిక సర్దుబాటు చేశారు. వీరే కాకుండా జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూల్స్ 47 ఉన్నాయి. వీటిలో పనిచేసే ఉపాధ్యాయులను కూడా సమీపంలోని పాఠశాలలకు డిప్యుటేషన్‌పై పంపించారు. ఏదేమైనా సీఎం మెగా డీఎస్సీ ప్రకటనతో ఈ సారి టీచర్ పోస్టులు భర్తీ చేస్తారా? లేక వచ్చే విద్యా సంవత్సరం కూడా సర్దుబాటుతో సరిపెడతారో వేచిచూడాల్సిందే.

పట్టణ ప్రగతి నిధుల విడుదలెప్పుడో?

- ఏడు నెలలుగా నిరాశే
- మెదక్ మున్సిపాలిటీకి నిలిచిపోయిన రూ. 1.19 కోట్ల నిధులు



పట్టణప్రగతి నిధులతో చిత్రాంజపల్లి కాలనీలో చేపట్టిన పార్కు ఫెన్సింగ్ పనులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 4: మున్సిపాలిటీల జనాభా ఆధారంగా పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రగతి పథకానికి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా ప్రతీ నెల మున్సిపాలిటీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ వచ్చింది. కానీ ఏడు నెలలుగా మున్సిపాలిటీలకు నిధుల విడుదల నిలిపివేసింది. ఈ నిధులతో పట్టణ ప్రగతిలో భాగంగా హరితహారం, పార్కుల నిర్వహణ, ఫెన్సింగ్‌ల ఏర్పాటుతో పాటు మౌలిక వసతులకల్పన, అత్యవసరమైన పనులకు నిధులు కేటాయించారు.

నిలిచిపోతున్న పనులు

టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు ఆయా పనులను పూర్తి చేశారు. మెదక్ మున్సిపాలిటీకి ప్రతీనెలా 17 లక్షల చొప్పున నిధులు జమ చేసిన ప్రభుత్వం, ప్రస్తుతం ఎటువంటి నిధులను విడుదల చేయలేదు. దీంతో కోటి 19 లక్షల రూపాయలు మున్సిపాలిటీకి చేరలేదు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఇప్పటికే కొంతమంది అకౌంట్ సెక్షన్లకు బిల్లులు పంపగా పట్టణ ప్రగతి నిధులు విడుదల కాకపోవడంతో వాటిని మంజూరు చేయలేదు. ఇప్పటికే సుమారు 20 లక్షలకుపైగా బిల్లులు చెల్లింపుల కోసం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మరికొన్ని పనులు పూర్తైనప్పటికీ, రికార్డింగ్ స్థాయిలో ఉన్నట్లు తెలిసింది. నిధుల విడదల కాకపోవంతో మరికొంత మంది పనులు చేసే విషయంలో ఆసక్తి చూపడం లేదు. నిధుల విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి పనిచేయించిన అధికారులు, పాలకులు తర్జనభర్జన పడుతున్నారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధిపై దృష్టి సారించి పట్టణ ప్రగతి నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.

నిధులు మంజూరు కాలేదు

ప్రగతి నిధులు ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఈ విషయంపై పలుమార్లు డీఎంఏకు నివేదించం. అయినా ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. ఈ విషయాన్ని పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లాం.

కమిషనర్ జానకీరాంసాగర్

త్వరలోనే ముఖ్యమంత్రిని కలుస్తాం

మౌలిక వసతులకల్పనలో భాగంగా మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి నిధులు మంజూరు చేస్తున్నారు. కాని కొన్ని నెలలుగా నిధులు విడుదల కావడం లేదు. మెదక్ మున్సిపాలిటీకి రూ.కోటికిపైగా నిధులు రావాల్సి ఉంది. ఇప్పటికే పలు పనులు పూర్తవగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ విషయంలో మున్సిపల్ చైర్మన్లందరం కలిసి ఒక నిర్ణయం తీసుకున్నాం. పట్టణ ప్రగతి నిధుల విడుదల కోసం త్వరలోనే ముఖ్యమంత్రిని కలవాలని నిర్ణయించుకున్నాం.

తొడుపునూరి చంద్రపాల్ మున్సిపల్ చైర్మన్

ఆకట్టుకున్న నమూనా అసెంబ్లీ



నమూనా అసెంబ్లీలో మాట్లాడుతున్న విద్యార్థులు

నారాయణఖేడ్, జనవరి 4: నారాయణఖేడ్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం నమూనా అసెంబ్లీని నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతోపాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ స్పీకర్ పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖాదర్ పాత్రలు పోషించిన వారిని విద్యార్థులకు పరిచయం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యాపకులు డానియల్, నహీద్ ఉన్నిసా బేగం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులు చక్కగా అసెంబ్లీని నిర్వహించినందుకు కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది వారిని అభినందించారు.

సమానత్వ సాధనే సావిత్రి బాయి పూలే ఆశయం

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్

నారాయణఖేడ్, జనవరి 4: సమానత్వ సాధనే సావిత్రిబాయి పూలే ఆశయమని, ఆమె ఆశయం నెరవేరాలంటే అందరికీ ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ అన్నారు. గురువారం ఖేడ్‌లోని కాలేజ్ హాస్టల్‌లో నిర్వహించిన సెమినార్‌లో సావిత్రిబాయి పూలే 193వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన మాటాడారు. 'ఆమె జీవితం సామాజిక న్యాయం' అనే అంశంపై ఆయన పలు అంశాలు తెలిపారు. వేల సంవత్సరాలుగా చదువు సంపదలను మెజార్టీ ప్రజలకు నిషేధించడం వల్లే నేటికి దేశం సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలేదన్నారు. అందువల్ల సమానత్వం సాధించడంతోనే వారికి నిజమైన నివాళులు అర్పించిన వారం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ డివిజన్ ఇంచార్జి సతీష్, నాయకులు పవన్, రాజ్‌కుమార్, సంజీవ్, ప్రశాంతి, సంతోష్, తదితరులుపాల్గొన్నారు.

రెవెన్యూ రికవరీ యాక్టుకింద రైస్‌మిల్లు వ్యాపారి ఆస్తుల సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

నర్సాపూర్, జనవరి 4: నర్సాపూర్‌కు చెందిన రైసుమిల్లు వ్యాపారి శ్రీధర్‌గుప్తాకు చెందిన పలు ఆస్తులను రెవెన్యూ రికవరీ యాక్టు కింద జప్తు చేసినట్లు తహసీల్దార్ కమలాద్రి పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కమలాద్రితో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పోలీసుల సహకారంతో శ్రీధర్ గుప్తా ఇంటికి వెళ్లి రెండుకార్లతో పాటు రెండు ఏసీలు, ఒక టీవీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకపోవడంతో ఆర్ఆర్ యాక్టు కింద రూ.47,17,36,000 చెల్లించాలని గతంలోనే శ్రీధర్‌గుప్తాకు నోటీసులు జారీ చేశారు. సకాలంలో స్పందించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయనకు సంబంధించిన ఆస్తులను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కాగా తన ఇంటికి వచ్చిన అధికారులతో శ్రీధర్‌గుప్తా వాగ్వాదానికి దిగారు. తాను ఎటువంటి తప్పు చేయలేదని కావాలనే కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు.

ఘనంగా ముగిసిన గురుకుల విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన

నర్సాపూర్, జనవరి 4: గిరిజన గురుకుల విద్యాలయాల విద్యార్థుల రీజినల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ఘనంగా ముగిసింది. రీజినల్ పరిధిలోని మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని 11 గురుకులాలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో విద్యార్థులు 22 అంశాలలో తమ ప్రతిభ చూపారు. అందులో యూత్‌పార్లమెంటు, కల్చరల్, పాటలు, క్విజ్, వ్యాసరచన, ఫ్యాషన్‌షో తదితర వాటిలో ఆయా విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. మొదటి బహుమతి పొందిన వారికి రూ. 500, రెండో బహుమతి రూ. 400, మూడో బహుమతి రూ. 300 చొప్పున రీజినల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భిక్షమయ్య వివిధ కళాశాలల ప్రధానచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఫ్యాషన్‌షో నిర్వహిస్తున్న దృశ్యం

తూప్రాన్ పెద్దచెరువులో

యువకుడి గల్లంతు

● గాలింపు చర్యలు చేపట్టి మృతదేహం వెలికితీత



లక్ష్మణ్ (ఫైల్)

తూప్రాన్, జనవరి 4: తూప్రాన్ పెద్దచెరువులో ఉన్న పర్యాటక శాఖ బోటు ఎక్కేందుకు ప్రయత్నించి చెరువులో పడిపోయి యువకుడు గురువారం గల్లంతయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లికి చెందిన తంగెళ్ల భిక్షపతి, రాణి దంపతులకు లక్ష్మణ్(22), రమాదేవి కవల పిల్లలు.భిక్షపతి కూతురు రమాదేవి వివాహం నిశ్చయం కాగా ఈనెల 7న వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉంటున్న భిక్షపతి కుమారుడు లక్ష్మణ్ పెళ్లి కోసం ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం కల్లు తాగేందుకు స్నేహితులు శ్రీకాంత్, కరుణాకర్‌తో కలిసి లక్ష్మణ్ తాతపాపన్‌పల్లికి వెళ్లాడు. కల్లు తాగిన అనంతరం ఒకే బైక్‌పై వెళితే పోలీసులు పట్టుకుంటారని తూప్రాన్ పట్టణ పెద్దచెరువు కట్ట మీదుగా హైవే బైపాస్ నుంచి రావెల్లికి బయలుదేరారు. పెద్దచెరువు కట్టపై వీరాంజనేయస్వామి ఆలయం వద్దకు వెళ్లగానే రావెల్లికి చెందిన మరో స్నేహితుడు నవీన్ కలిశాడు. తూప్రాన్‌లో పని ఉందని లక్ష్మణ్ చెప్పడంతో శ్రీకాంత్, కరుణాకర్ ఒక బైక్‌పై, నవీన్, లక్ష్మణ్ మరో బైక్‌పై బయల్దేరారు. కొంత దూరం రాగానే లక్ష్మణ్ బండి ఆపి చెరువులో బట్టలు ఉతుక్కోడానికి దిగాడు. స్నేహితులు బయట ఉండగా బట్టలు ఉతికి ఆరేసి బతుకమ్మ ఘాటు వద్ద చెరువులో స్నానం చేసే ప్రయత్నం చేశాడు. అక్కడే పర్యాటక శాఖ బోటు ఉండటంతో దానిని పట్టుకొని ఎక్కేందుకు ప్రయత్నించి చెరువులో పడి మునిగిపోయాడు. అక్కడే ఉన్న స్నేహితులు గాలింపులు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబీకులు, గ్రామస్థులు పెద్దఎత్తున పెద్దచెరువు వద్దకు చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టి రాత్రి లక్ష్మణ్ మృతదేహాన్ని వెలికితీశారు.

స్నానం కోసం చెరువులోకి దిగి యువకుడి మృతి

చిన్నశంకరంపేట, జనవరి 4: స్నానం కోసం చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని సూరారం గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుద్దు రాజు(23) తాత మృతిచెందడంతో ఆయన అంత్యక్రియల్లో పాల్గొని గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లాడు. స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందాడు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. రాజుకు భార్య శిరీష ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన పరశురాం

గజ్వేల్ రూరల్, జనవరి 4: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన నింగోల్ల పరశురాం(48) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంపై గజ్వేల్‌కు వచ్చాడు. తిరిగి రాత్రి గ్రామానికి వెళ్తుండగా గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామ శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో రోడ్డుపై నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ప్రమీల, కుమారులు పవన్, ప్రదీప్ ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగొద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య

మెదక్ అర్బన్, జనవరి 4 : అతిగా మద్యం సేవించవద్దని తల్లిదండ్రులు మందలించినందుకు మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్‌లో ఓ యువకుడు బుధవారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భయ్యా అనిల్(22) మేస్త్రీ పని చేస్తుంటాడు. బుధవారం రాత్రి అతిగా మద్యం తాగి ఇంటికి చేరుకున్నాడు. ఎందుకు మద్యం అతిగా తాగుతున్నావని తల్లిదండ్రులు మందలించారు. దీంతో కోపంతో మద్యం మత్తులో రాత్రి ఇంట్లో తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి కుటుంబసభ్యులు వెళ్లి చూడగా.. గదికి గడి పెట్టి ఉంది. తలుపులను తెరిచి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ అమర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి

నర్సాపూర్, జనవరి 4: ఆటో డ్రైవర్ తాను నడుపే ఆటోలోనే స్పృహ కోల్పోయి చనిపోయిన ఘటన గురువారం వెలుగుచూసింది. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన రామనర్సింలు(40) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తాడు. బుధవారం ఉదయం 9గంటలకు ఆటో తీసుకుని ఇంటి నుంచి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం మండలంలోని లింగాపూర్ సమీపంలో ఆటోలో డ్రైవర్ సీటులో స్పృహ కోల్పోయి పడి ఉండగా అది గమనించిన కొందరు గుర్తించి ఆయనను వారి ఇంటికి తీసుకువచ్చారు. నోటి నుంచి నురుగులు రావడంతో ఇంటి నుంచి వెంటనే నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు చెప్పారు. గురువారం భార్య లక్ష్మి పోలీసులకు భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



దగ్ధమైన ఇల్లును పరిశీలిస్తున్న ఆర్ఐ

సదాశివపేట, జనవరి 4 : అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన గురువారం సదాశివపేట మండలం మద్దికుంట గ్రామంలో జరిగింది. సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మహేష్‌గౌడ్(28) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మహేష్‌గౌడ్ కాలుకు కొద్దిరోజుల క్రితం తీవ్ర గాయమైంది. గాయానికి చికిత్స చేయించుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో అది కాస్తా విషమించింది. మూడు రోజుల క్రితం మహేష్‌గౌడ్ గ్రామంలో కొందరితో గొడవపడ్డాడు. గురువారం సాయంత్రం సమయంలో మహేష్‌గౌడ్ హఠాత్తుగా మృతిచెందాడు. అనుమానాస్పదంగా చనిపోయిన తన తమ్ముడి మృతి పట్ల విచారణ జరపాలని మహేష్‌గౌడ్ సోదరుడు క్రిష్ణగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● రూ.5 లక్షల ఆస్తి నష్టం

నిజాంపేట, జనవరి 4 : మండల పరిధిలో షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుంట గ్రామంలో బుధవారం రాత్రి పందిరి రుక్మయ్యకు చెందిన ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ఇరుగుపొరుగు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అయినా అదుపులోకి రాకపోవడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. కొద్దిసేపటి తరువాత చేరుకున్న ఫైర్‌ఇంజన్ మంటలను ఆర్పింది. మంటలు చెలరేగిన సమయంలో ఇంట్లో ఎవరు లేనందున ప్రాణనష్టం జరగలేదు. గురువారం తహసీల్దార్‌కు సమాచారం అందించగా ఆర్ఐ గంగాధర్ ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించారు. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు. ఈ నివేదికను పైఅధికారులకు అందజేసి బాధితుడికి ప్రభుత్వం ద్వారా సహాయం అందేలా చేస్తామని ఆర్ఐ తెలిపారు.

తాళం పగులగొట్టి పౌల్ట్రీఫాంలో చోరీ

శివ్వంపేట, జనవరి 4: పౌల్ట్రీఫాంలోని ఓ గదికి వేసి ఉన్న తాళాన్ని పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని గుండ్లపల్లిలో గురువారం వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలో నజీయొద్దీన్ పౌల్ట్రీ ఫాంను లీజుకు తీసుకుని నడిపిస్తున్నాడు. పౌల్ట్రీఫాంలోని కోళ్లు అమ్మగా వచ్చినా డబ్బు రూ.2 లక్షలను ఫాంలోని ఓ గదిలో ఉంచాడు. బుధవారం సాయంత్రం ఆ గదికి తాళం వేసి సమీపంలోని దొంతి గ్రామానికి వెళ్లి వచ్చాడు. గది తాళం పగుల గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రూ.2 లక్షల నగదు అపహరణకు గురైంది. ఈ మేరకు నజీయొద్దీన్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎన్నాళ్లీ నిరీక్షణ!

జహీరాబాద్‌లో దశాబ్దాలుగా కొలిక్కిరాని ఐడీఎస్‌ఎంటీ ప్లాట్ల సమస్య

● రిజిస్ట్రేషన్లు పూర్తయినా ప్లాట్ ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి
● కాలనీలో ఇళ్లను నిర్మించుకున్న వారికి వసతులు కరువు
● హామీలకే పరిమితమైన నేతలు, అధికారులు

జహీరాబాద్, జనవరి 4 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ సమీపంలో 1982లో ఏర్పాటు చేసిన చిన్న, మధ్య తరహా పట్టణ సమగ్రాభివృద్ధి పథకం(ఐడీఎస్‌ఎంటీ) కాలనీలో ప్లాట్ల కేటాయింపు సమస్య దశాబ్దాల కాలంగా కొలిక్కిరావడం లేదు. ఐడీఎస్‌ఎంటీ అంటేనే అమ్మో అదో వివాద సమస్య అనే స్థాయికి కొందరు తెచ్చిపెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు, నాయకులు హామీలకే పరిమితమయ్యారు. లబ్ధిదారులు మాత్రం సమస్య పరిష్కారం కోసం ఏళ్లుగా నిరీక్షిస్తూనే ఉన్నారు.

101 ఎకరాల్లో 1,294 ప్లాట్లు

1982లో అప్పటి ప్రభుత్వం జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డుకు ఆనుకుని ఉన్న 156, 157, 158, 160, 161 సర్వే నంబర్లలోని 101 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఐడీఎస్‌ఎంటీ ప్లాట్లను చేశారు. మొత్తం 1,294 ప్లాట్లకు 1,115 ప్లాట్లను రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు సిద్ధం చేశారు. 1987లో పంపిణీ ప్రక్రియను ప్రారంభించింది. 2009 వరకు ఏటా కొన్ని చొప్పున నామినల్ ఫీజుతో మున్సిపాలిటీలో రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే నిబంధనల ప్రకారం అధికారులు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా నాయకులు రిజిస్ట్రేషన్‌లు చేశారు. అయితే అనర్హులకు కేటాయించారని, రిజిస్ట్రేషన్లను రద్దుచేయాలని 2009లో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. 2009 నుంచి 2013 వరకు ప్లాట్ల సమస్య న్యాయస్థానం పరిధిలో ఉండడంతో ఐడీఎస్‌ఎంటీ విషయంలో అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. 2013లో నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన వాటిని రద్దుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. దీంతోఅధికారులు అప్పట్లో బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. అప్పటి నుంచి ఈ వ్యవహారాన్ని ఎటూ తేల్చకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

300 మంది ఇళ్లను నిర్మించుకున్నారు

అప్పట్లో ఇందులో పేదలకు ఎల్‌ఐజీ, మధ్యతరహా వారికి ఎంఐజీ, ఉన్నతాదాయ వర్గాల వారికి హెచ్‌ఐజీ, వెనుకబడిన వర్గాలకు ఈడబ్ల్యూఎస్ అంటూ బ్లాక్‌లుగా విభజించి ప్లాట్ల కేటాయింపులకు శ్రీకారం చుట్టారు. ఇందులో హెచ్‌ఐజీలో 76 ప్లాట్లు, ఎంఐజీలో 264 ప్లాట్లు, ఎల్‌ఐజీలో 305, ఈడబ్ల్యూఎస్ మరికొన్ని ప్లాట్లను అప్పట్లో సిద్ధం చేశారు. ఈడబ్ల్యూఎస్ కింద 110 గజాలకు రూ.5వేలు, ఎల్‌ఐజీలో 260 గజాలకు 15వేలు, ఎంఐజీలో 300 గజాలకు రూ.16,500, హెచ్‌ఐజీలో 360 గజాలకు రూ.21,000 చొప్పున ఫీజులను నిర్ధారించి అప్పట్లో రిజిస్ట్రేషన్‌లను చేశారు. ప్రస్తుతం అందులో సుమారు 300 మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకున్నారు. కాలనీలో వసతులు కల్పించాలని అధికారులకు, పాలకులను వేడుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



ఐడీఎస్‌ఎంటీకి సంబంధించిన వివరాలన్నీ ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు వస్తే మ్యుటేషన్ ప్రారంభిస్తాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా తదుపరి కార్యాచరణ చేపడుతాం.

- సుభాష్‌రావు, మున్సిపల్ కమిషనర్

ఎన్నికల ప్రకటనతో మ్యుటేషన్‌కు బ్రేక్

అయితే ఇళ్లను నిర్మించుకున్న వారు కాకుండా మరికొందరు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. వారి వద్ద రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు మాత్రమే ఉన్నాయి కానీ ప్లాట్ ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఏళ్ల తరబడి నానుస్తూ వస్తున్న ఐడీఎస్‌ఎంటీ ప్లాట్ల సమస్యను స్థానిక నాయకులు, లబ్ధిదారులు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌కు విన్నవించగా వారు స్పందించి వివాదస్పదంగా లేని వాటిని మ్యుటేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. వారి ఆదేశాలతో సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న క్రమంలోనే ఎన్నికల షెడ్యూల్ రావడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ సమస్య తీరుతుందని ఆశించిన లబ్ధిదారులకు మరోమారు నిరాశే ఎదురైంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఐడీఎస్‌ఎంటీ కోసం కేటాయించిన స్థలం

నీటి నాణ్యతా పరీక్షలకు చెల్లు!

● పేరుకే వాటర్ అనాలసిస్ ల్యాబ్
● పాడవుతున్న ప్రయోగశాల పరికరాలు, సామగ్రి
● సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వృథాగా ప్రయోగశాల

సంగారెడ్డి అర్బన్, జనవరి 4 : గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచి నీటి సరఫరా పథకాలపై నిఘా ఉంచి, ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో నీటి నాణ్యతా పరీక్షలను నిర్వహిస్తున్నది. ఆహార కల్తీ, నీటి నాణ్యత పర్యవేక్షణ విభాగం ఈ పరీక్షల నిర్వహణ బాధ్యత చూస్తుంది. అయితే కొన్నేళ్లుగా నీటి నాణ్యతా పరీక్షలు అటకెక్కాయి. సిబ్బంది లేరన్న కారణంతో పరీక్షలను నిలిపేశారు. దీంతో జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని నీటి నాణ్యత ప్రయోగశాల వృథాగా పడి ఉన్నది.



వాటర్ అనాలసిస్ ల్యాబ్‌లో వృథాగా ఉన్న ప్రయోగ పరికరాలు, రసాయనాలు,



సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలోని జిల్లా నీటి నాణ్యత ప్రయోగశాల

వేధిస్తున్న సిబ్బంది కొరత

సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో నీటి నాణ్యతా పర్యవేక్షణ ప్రయోగశాల పేరుకే ఉన్నది. ఈ వాటర్ అనాలసిస్ ల్యాబ్‌లో అన్ని రకాల సామగ్రి, సౌకర్యాలున్నా పరీక్షల నిర్వహణకు సిబ్బంది కొరత వేధిస్తున్నది. జూనియర్ అనలిస్ట్, ఎల్‌టీ, ల్యాబ్ అటెండెంట్, టైపిస్ట్, వాటర్ శాంపిల్ టేకర్ ఇలా ఐదుగురు సిబ్బంది ఉండాలి. కానీ తాత్కాలిక శాంపిల్ టేకర్ తప్ప మిగతా సిబ్బంది ఎవరూ లేరు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల వాటర్ ట్యాంక్‌ల నుంచి శాంపిళ్లుగా నీటిని టేకర్ తీసుకొచ్చినా పరీక్షలు చేసే వారు లేకపోవడంతో శాంపిళ్లుగా తెచ్చిన నీటి డబ్బాలు ల్యాబ్‌లో వృథాగా పడి ఉంటున్నాయి.

ల్యాబ్‌లో గడువు ముగిసిన రసాయనాలు

వాటర్ అనాలసిస్ ల్యాబ్‌లో నాణ్యతా పరీక్షలకు వినియోగించే రసాయనాల గడువు ముగియడం గమనార్హం. ఫలితంగా పరీక్షలు చేయడంలేదనే విషయం స్పష్టంగా తెలిసిపోతుంది. ఏళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో ప్రయోగశాల సామగ్రి కూడా దుమ్ము, ధూళితో దర్శనమిస్తోంది. విలువైన పరికరాలు, సామగ్రి, పరీక్షల కిట్లు పాడైపోతున్నాయి. వాటర్ శాంపిళ్లలో బ్యాక్టీరియా, ఫ్లోరైడ్, క్షారాలు, క్లోరైడ్ తదితర మూలికాల శాతాన్ని గుర్తించేందుకు నాణ్యతా పరీక్షల విశ్లేషణ చేసి ప్రజలకు తాగు నీరందించాలి. ప్రభుత్వ ఉద్దేశం బాగానే ఉన్నప్పటికీ చేసేవారే లేక తాగునీటి కలుషితాన్ని గుర్తించలేక పోతున్నారు.

తొంగి చూడని పర్యవేక్షణాధికారులు !

వాటర్ అనాలసిస్ ల్యాబ్‌లో కొనేళ్లుగా నీటి నాణ్యతా పరీక్షలు నిలిచిపోయినా సంబంధిత శాఖల అధికారులు, ఉన్నతాధికారులు అటుగా తొంగిచూడని పరిస్థితి. ఆహార కల్తీ, నీటి నాణ్యత పర్యవేక్షణాధికారులు, ఐపీఎం అధికారులు వీటిపై దృష్టి సారించాల్సి ఉన్నా, ఎవరడుగుతారనే ధీమాతో మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలున్నాయి. కాగా ఈ ల్యాబ్‌కు పూర్తి స్థాయి బాధ్యత లున్న అధికారితో పాటు సిబ్బందిని కూడా ప్రభుత్వం నియమించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతానికి జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారికే ఈ ల్యాబ్ బాధ్యతలు అప్పగించారు.

ప్రజాపాలన దరఖాస్తులకు కొరత రావొద్దు

● 16 వరకు డాటా ఎంట్రీ పూర్తి కావాలి
● టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ వి.క్రాంతి ఆదేశం




టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 4 : ప్రజాపాలన దరఖాస్తులకు జిల్లాలో ఎక్కడా కొరత రావొద్దని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వి.క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌గా గురువారం బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆమె ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్‌లు, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మిగిలిన రెండు రోజుల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తూ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఎక్కడా దరఖాస్తుల కొరత రాకుండా చూసుకోవాలని, అదనంగా అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రక్రియను 16వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. డేటా ఎంట్రీ ప్రక్రియను మున్సిపల్, మండలాల వారీగా నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎంత మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు అవసరం ఉన్నారు అనేదానిపై ముందస్తు ప్రణాళికతో గుర్తించాలన్నారు. డేటా ఎంట్రీలో ఒక్క దరఖాస్తు మిస్ కావొద్దని, ఆధార్, రేషన్‌కార్డు నంబర్లు తప్పు లేకుండా నమోదు చేసేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ క్రాంతి దరఖాస్తుల స్వీకరణ, డేటా ఎంట్రీ ప్రక్రియ కోసం ఏవిధమైన ప్రణాళిక చేస్తున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

● మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



తూప్రాన్‌లో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్

తూప్రాన్, జనవరి 4: ప్రజాపాలన దరఖాస్తులను సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. తూప్రాన్ 11వ వార్డు పడాలపల్లిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ గురువారం సందర్శించారు. దరఖాస్తు స్వీకరణ వివరాలను మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు ఫారాలను పరిశీలించి వార్డు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్, జడ్పీ సీఈవో వెంకట శైలేష్, కౌన్సిలర్ బొంది అరుణ వెంకట్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

పొలంపల్లిలో పరిశీలన

చేగుంట, జనవరి 4: మండలంలోని పొలంపల్లి గ్రామంలో కలెక్టర్ రాజర్షిషా ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించాలని సదుద్దేశంతోనే ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి బీమ్లా నాయక్, తహసీల్దార్ గియా ఉన్నీసా బేగం, సర్పంచ్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి బృందాన్ని కారుతో ఢీకొని.. ఒకరిని పొట్టనబెట్టుకున్న దాయాది

ఐదుగురికి గాయాలు

● మెదక్ జిల్లా రెడ్డిపల్లి వడ్డెర కాలనీలో ఉద్రిక్తత
● భూతగాదాలే కారణం





మృతిచెందిన రమ్య(ఫైల్), రోదిస్తున్న గాయపడిన వారు

చేగుంట, జనవరి 4: పాతకక్షలతో పెళ్లి బృందాన్ని కారుతో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఐదుగురికి తీవ్రగాయాలైన సంఘటన మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలో గురువారం జరిగింది. మండలంలోని రెడ్డిపల్లి వడ్డెరకాలనీలో ఒకే కుటుంబానికి చెందిన ఉప్పు స్వామి, ఉప్పు నరేందర్ మధ్య భూమికి సంబంధించిన గొడవలు ఉన్నాయి. ఉప్పు స్వామి తన కుమార్తె సువర్ణ వివాహాన్ని గురువారం నిర్వహించారు. సాయంత్రం పెళ్లి కూతురును అత్తగారింటికి సాగనంపుతున్న క్రమంలో ఉప్పు నరేందర్ పెళ్లి బృందం వైపునకు అతివేగంతో కారును నడుపుకుంటూ వచ్చాడు. కారుతో ఆరుగురిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఉప్పు రమ్య, దుర్గయ్య, సంపంగి, యాదగిరి, సుజాత, బబ్బుకు తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉప్పు రమ్య మృతి చెందింది. దుర్గయ్య, యాదగిరి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. కారును వేగంగా నడుపుతున్న సమయంలో బీమ్రావుపల్లికి చెందిన కాపు యాదగిరి బైక్‌ను ఢీకొనడంతో బైక్ ధ్వంసమైంది. ఈ ఘోర ఘటనతో వడ్డెర కాలనీలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కారుతో బీభత్సం సృష్టించిన నరేందర్ పరారీలో ఉన్నాడు.

పది గట్టెక్కేదెలా?

● మరో మూడు నెలల్లో పరీక్షలు.. ఉపాధ్యాయులే లేరు!

మెదక్ అర్బన్, జనవరి 2: సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపోను ఉపాధ్యాయులు లేరు. టీచర్ల పోస్టులు ఖాళీలతో మెదక్ జిల్లావ్యాప్తంగా వివిధ జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు బోధన ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో 146 ఉన్నత పాఠశాలలున్నాయి. మరో మూడు నెలల్లో పది పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో త్వరితగతిన అన్ని సబ్జెక్టుల్లో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించాల్సి ఉంది. కానీ అత్యధిక పాఠాలల్లో పాఠ్యాంశ నిపుణుల కొరత వల్ల ఇప్పటివరకు సిలబస్ పూర్తి కాలేదు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 1,709 మందికి 1,444 మంది మాత్రమే బోధిస్తున్నారు. ఇంకా 265 మంది ఉపాధ్యాయుల అవసరం ఉంది. ప్రస్తుతం బయాలజీ, సోషల్‌లో స్కూల్‌అసిస్టెంట్(ఎస్ఏ)ల కొరత ఏర్పడింది. జిల్లాలో మొత్తం 3,950 పోస్టుల మంజూరుకు 3,434 మంది విధులు నిర్వహిస్తుండగా 525 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధాన సబ్జెక్టుల్లో టీచర్లు లేకపోవడంతో చదువులు కుంటుపడుతున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్దుబాటు మరిచారు




తరగతి గదిలో టెన్త్ విద్యార్థులు

జిల్లాలో మూడు నెలల కింద ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించారు. పలు పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టులు బోధిస్తున్న 20 మంది సీనియర్ ఉపాధ్యాయులు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతిపై వెళ్లారు. వీరితో పాటు జిల్లా నుంచి కొందరు పదోన్నతిపై ప్రధానోపాధ్యాయులుగా వెళ్లారు. కొందరు ఎస్ఏలకు బదిలీలు జరిగినప్పటికీ రిలీవర్ లేరన్న కారణంగా వారు నూతన పోస్టుల్లో చేరలేదు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలను సమీప ఉన్నత పాఠశాలలకు పంపి కొన్ని చోట్ల సర్దుబాటు చేశారు. అదీ పూర్తిస్థాయిలో జరగలేదు. దాంతో జిల్లాలో ఉన్న పలు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతికి బోధించేందుకు ప్రధాన సబ్జెక్టుల్లో నిపుణుల కొరత ఏర్పడింది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి త్వరితగతిన సర్దుబాటులో భాగంగా ఉన్నత పాఠశాలలకు పాధ్యాయులను పంపితే పది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు

హోదా	మంజూరు	పని చేస్తున్నవారు	ఖాళీలు
పీఎస్ హెచ్‌ఎంలు	114	56	58
స్కూల్ అసిస్టెంట్‌లు	1376	1092	284
సెకండరీ గ్రేడ్ టీచర్‌లు	1959	1806	153
హెచ్‌ఎంలు	136	136	0
పీఈటీలు	52	52	0
భాషా పండితులు	322	292	30

సకాలంలో సిలబస్ పూర్తి చేస్తాం



టెన్త్ విద్యార్థులకు ఈ సంక్రాంతిలోపు సిలబస్ పూర్తి చేస్తాం. జిల్లా వ్యాప్తంగా పలు ఉన్నత పాఠశాలల్లో ప్రధాన సబ్జెక్టుల ఖాళీలను పని సర్దుబాటులో భాగంగా సమీప పాఠశాలల ఉపాధ్యాయులను అడ్జస్ట్ చేశాం. విద్యార్థులకు ఇబ్బంది కలగనీయం. ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాస్ నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం.

- రాధాకిషన్, డీఈవో, మెదక్

గ్యారంటీల అమలుకే ప్రజాపాలన

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

హవేళిఘణపూర్, జనవరి 4: ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. గురువారం హవేళిఘణపూర్ మండలంలోని గాజిరెడ్డిపల్లి, భూర్గుపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పక్కాగా నెరవేరుస్తామని, మెదక్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎస్పీ మహేందర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జయరాజ్ మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో శ్రీరాం, ఎంపీటీసీ అర్చనశ్రీనివాస్, సర్పంచ్ సాప భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన

నారాయణఖేడ్/కంగ్టి/మనూరు: ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం కోసమే తమ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని చేపట్టిందని ఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్ మండల పరిధిలోని తుర్కపల్లి, గంగాపూర్ గ్రామాలు, మండల కేంద్రమైన కంగ్టి, మనూరు మండలం బెల్లాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి రసీదులు ఇవ్వాలని సూచించారు. అధికారులు జవాబుదారీతనంతో పాటు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కంగ్టి తహసీల్దార్‌ను ఆదేశించారు. సిద్ధేశ్వరాలయ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో తుర్కపల్లి, గంగాపూర్ సర్పంచులు స్రవంతిపరమేశ్వర్, శ్రీనివాస్, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్‌చౌహాన్, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, నెహ్రూనాయక్, శివకుమార్, ఉప్పరి సాయిలు, బాలకృష్ణసాగర్, కంగ్టి ఎంపీపీ సంగీతా వెంకట్‌రెడ్డి, సర్పంచులు సుగుణ, సురేఖ, డీఎల్‌పీవో సంజీవ్, తహసీల్దార్ విష్ణుసాగర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సర్దార్, నాయకులు మనోజ్‌పాటిల్, చందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మనూరు ఎంపీడీవో షాజీలొద్దీన్, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దిగంబర్‌రెడ్డి, దత్తిగొండ పాల్గొన్నారు.

ప్రతీ హామీని కాంగ్రెస్ నెరవేరుస్తుంది

జిన్నారం: ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం కొడకంచి, వావిలాలలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో కాట శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిర్దిష్ట గడువులోగా అమలు చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు శివరాజ్, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వడ్డె కృష్ణ, నర్సింగరావు, ఎంపీటీసీ జానాభాయి, నవనీత్‌రెడ్డి పాల్గొన్నారు.

పారదర్శక పాలనే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం

హత్నూర/వెల్దుర్తి: రాష్ట్రంలో ప్రజలకు పారదర్శక పాలన అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులుగౌడ్ అన్నారు. గురువారం హత్నూర మండలం సిరిపురం, తెల్లరాళ్ల తండా, వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వెల్దుర్తి మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి ఉన్నారు.

పలుగ్రామాల్లో కొనసాగిన ప్రజాపాలన

జహీరాబాద్: జహీరాబాద్ మండలంలోని బూడిపాడ్, తూంకుంట గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. మొగుడంపల్లి మండలంలోని చున్నంబట్టితాండ, పడియాల్ తండా, జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్, రంజోల్, బాబానగర్ ప్రాంతాల్లో ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో సుమతి, తహసీల్దార్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు పాల్గొన్నారు.

●నర్సాపూర్: నర్సాపూర్ 11వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన సభకు నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు హాజరై దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌గోపాల్, కౌన్సిలర్ రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకులు జ్ఞానేశ్వర్, రింగుల ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

●పుల్‌కల్: చౌటకూర్ మండలంలోని గంగోజిపేట, చక్రియాల గ్రామాల్లో తహసీల్దార్ ఈశ్వరీరాణి ఆధ్వర్యంలో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుని, రసీదులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు బుర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బక్కారెడ్డి కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ అందోలు కృష్ణ, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

●రేగోడు: ప్రజాపాలన గ్రామసభలు రేగోడు మండలంలో గురువారంతో ముగిశాయి. చివరి రోజు తిమ్మాపూర్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ నెల 6 వరకు కూడా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులను అందించవచ్చునని ఎంపీడీవో సీతారావమ్మ తెలిపారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్పంచ్ నిర్మల, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

●శివ్వంపేట: మండల పరిధిలోని చిన్నగొట్టిముక్లలో ప్రజాపాలన కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, ఎంపీడీవో భారతి, సర్పంచ్ బాలమణినరేందర్, ఉపసర్పంచ్ భిక్షపతిరావు పాల్గొన్నారు.



గాజిరెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



హత్నూర మండలం సిరిపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి



జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లో దరఖాస్తులు ఇచ్చేందుకు బారులు తీరిన ప్రజలు



కొడకంచిలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న కాట శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ రవీందర్



నర్సాపూర్ 11వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్

రా.. చూసుకుందాం

● స్వెటర్ గుండీలు విప్పి సవాల్ చేసిన కౌడిపల్లి తహసీల్దార్



ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్‌ను కోరుతున్న ఇన్‌చార్జి సర్పంచ్ రాజేందర్

కౌడిపల్లి: మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం ఇన్‌చార్జి సర్పంచ్, బీజేపీ నాయకులు నిలిపివేశారు. ఈ క్రమంలో జరిగిన వాగ్వాదంలో సహనం కోల్పోయిన తహసీల్దార్ స్వెటర్ గుండీలు విప్పి చూసుకుందాం రా అంటూ బీజేపీ నాయకులకు సవాల్ చేశారు. గురువారం వెల్మకన్నెలో ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణకు అధికారులు వెళ్లారు. ఈ క్రమంలో బీజేపీ నాయకుడు రాకేష్ ప్రధాని మోదీ, స్థానిక ఎమ్మెల్యే ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తామని పేర్కొనగా తహసీల్దార్ అంజనేయులు ఒప్పుకోలేదు. దీంతో ఇద్దరి మధ్యా వాగ్వాదం నెలకొంది. సహనం కోల్పోయిన తహసీల్దార్ తాను వేసుకున్న స్వెటర్ గుండీలను తీసి, చూసుకుందాం అనడంతో మరింత జటిలంగా మారింది. అక్కడ ఉన్న సిబ్బంది ఇరువురికి సర్దిచెప్పి ప్రజాపాలన కార్యక్రమాన్ని కొనసాగించారు. కాగా గ్రామానికి చెందిన ప్రభుత్వ భూములను ఇతర గ్రామాలకు చెందిన అనేక మంది కబ్జా చేస్తున్నారని ఇన్‌చార్జి సర్పంచ్ రాజేందర్ ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే ప్రజాపాలన కార్యక్రమాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతా



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, జనవరి 4: పట్టణ పద్మశాలీ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం పట్టణంలోని సంఘం భవనంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మునిపల్లి విశ్వనాథం, కార్యదర్శులు నక్క ప్రభాకర్, చిలువేరి వెంకటేశం, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింతా ఆనంద్‌కుమార్, సభ్యులు పాశికంటి మల్లేశం, పద్మశాలీ, చేనేత సహకార సంఘాల సభ్యులు చిలువేరి రవికుమార్, చింతా ఆదర్శ్‌కుమార్, అంబటి విశ్వనాథం, గడీల గణేశం, చికుర్తి అంజయ్య, అడ్డగట్ల మనోహర్, మునిపల్లి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



చేర్యాల ఉన్నత పాఠశాలలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీచర్లు

కంది, జనవరి 4: కంది మండల పరిధిలోని చేర్యాల ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫోరం) నూతన సంతవత్సర క్యాలెండర్‌ను గురువారం టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.సోమశేఖర్, పాఠశాల హెచ్‌ఎం వెంకటరాజయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు మొదటి తారీఖున వేతనాలు రాక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు ఒకటో తారీఖున వేతనాలివ్వాలని కోరారు. జిల్లాలోని సర్వశిక్ష ఉద్యోగులకు, కేజీబీవీ ఉపాధ్యాయులకు గత నెల వేతనాలు ఇప్పటివరకు రాలేదని, వెంటనే విడుదల చేయాలని సోమశేఖర్ కోరారు.

చిన్నశంకరంపేటలో



చిన్నశంకరంపేటలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని హైస్కూల్‌లో టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఉపాధ్యాయులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, దీప్ల, పనీంద్ర, సుధాకర్, జగన్, అన్నపూర్ణ, రాథోడ్, చంద్రం, రియాజ్, శ్రీనివాస్, శ్రీకాంత్, యాదగిరి, మహెందర్, తిరుపతి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట క్రైం: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య పరిస్థితులు భరించలేక వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని కేసీఆర్ నగర్‌కు చెందిన మహ్మద్ యూసుఫ్(40) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో పాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం భార్య వంట చేస్తుండగా బెడ్ రూంలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

తండ్రుల నేత్రాలను దానం చేసిన కుమారులు

గజ్వేల్: తండ్రుల నేత్రాలను కుమారులు దానం చేశారు. గజ్వేల్ పట్టణానికి చెందిన చెన్న రాజయ్య మృతిచెందగా ఆయన నేత్రాలను కుమారులు లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ బ్రాంచ్‌కు అందజేశారు. అంతేకాకుండా గజ్వేల్ మండలం దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన అంజయ్య మృతిచెందగా ఆయన తనయుడు నర్సింహులు సైతం తండ్రి కళ్లను లయన్స్ క్లబ్ స్నేహ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ ట్రస్ట్‌కు దానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ సభ్యులు నేతి శ్రీనివాస్, నంగునూరి సత్యనారాయణ, బొమ్మ రమణ, సిద్ది భిక్షపతి మాట్లాడుతూ నేత్రాలను దానం చేసి కంటి చూపులేని వారికి కంటి చూపునిచ్చే విధంగా కృషిచేయడం గొప్పవిషయమన్నారు. ఈ సందర్భంగా వారి కుమారులను అభినందించారు.

రామాలయానికి లక్ష రూపాయల నాపరాళ్లు

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లోని రామాలయానికి స్థానికంగా ఉన్న వేంకటేశ్వర షాపింగ్‌మాల్ యజమాని నీల వెంకటేశం, శోభారాణి దంపతులు రూ.లక్ష విలువ చేసే నాపరాళ్లను విరాళంగా అందజేశారు. రామాలయం పునర్నిర్మాణంలో భాగంగా నాపరాళ్లను అందజేసిన వెంకటేశం దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి: ఎస్‌ఎఫ్ఐ

మద్దూరు: మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్‌లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందివ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ విషయమై విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేసి మాట్లాడారు. కొన్నిరోజులుగా మెనూ ప్రకారంగా గుడ్లు, చికెన్ అందివ్వడం లేదన్నారు. ఈ విషయం విద్యాశాఖాధికారులకు తెలిపినా పట్టించుకోకుండా కాలయాపన చేస్తూ రావడం బాధాకరమన్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు.

అన్నపూర్ణకు ప్రతిభా పురస్కారం



అవార్డును అందుకుంటున్న అన్నపూర్ణ

జహీరాబాద్, జనవరి 4: జహీరాబాద్‌కు చెందిన మైత్రీ మహిళా అభివృద్ధి సొసైటీ అధ్యక్షురాలు జంజీరాల అన్నపూర్ణకు బుధవారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. బీసీ సంక్షేమ శాఖ అధికారులు సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరించుకుని సమాజ సేవకురాలైన అన్నపూర్ణను ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసి, హైదరాబాదులో అవార్డును అందజేశారు.

ఆర్చి ఫార్మా కంపెనీలో బీఆర్టీయూ విజయం



ఆర్చి ఫార్మా కంపెనీ వద్ద సంబరాలు జరుపుకుంటున్న బీఆర్టీయూ శ్రేణులు

సిద్దిపేట అర్బన్, జనవరి 4: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని ఆర్చి ఫార్మా కంపెనీలో జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్టీయూ అభ్యర్థి మారెడ్డి రవీందర్‌రెడ్డి తన సమీప బీఎంఎస్ అభ్యర్థి మల్లేశంపై ఘన విజయం సాధించారు. గురువారం సాయంత్రం ఫలితాలు ప్రకటించడంతో బీఆర్టీయూ శ్రేణులు ఆర్చి ఫార్మా కంపెనీ వద్ద టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మారెడ్డి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా ఆర్చి ఫార్మా కంపెనీలో బీఎంఎస్ విజయం సాధిస్తూ వస్తోందని, ప్రస్తుతం బీఎంఎస్ కంచుకోటను బద్దలు కొట్టి బీఆర్టీయూ అభ్యర్థిగా ఘన విజయం సాధించామని అన్నారు. కార్మికులు తన గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఎన్నికల సమయం వరకే బేధాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. ఆ తర్వాత కార్మికులందరిని కలుపుకుని పనిచేస్తానని తెలిపారు. భవిష్యత్‌లో కలిసికట్టుగా పనిచేస్తూ హక్కుల కోసం పోరాడుదామని చెప్పారు.

మనోధైర్యంతో లక్ష్యాన్ని చేరుకోవాలి

● జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి

● కలెక్టరేట్‌లో బ్రెయిలీ జయంతి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో కేక్‌ను కట్ చేస్తున్న సంక్షేమ శాఖ అధికారులు, దివ్యాంగులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 4: దివాంగులు తమ వైకల్యాన్ని మరిచి, మనోధైర్యంతో తమ లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి సూచించారు. బ్రెయిలీ లిపితో ఎంతో మంది అంధులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం జిల్లా మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంధుల అక్షర ప్రదాత లూయీ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి మాట్లాడుతూ.. అంధుల అక్షర ప్రదాత లూయీ బ్రెయిలీ తనకు అంధత్వం వచ్చిందని బాధపడకుండా అంధులు కూడా చదువుకోడానికి వీలుగా ప్రత్యేక లిపిని కనుగొన్నారని చెప్పారు. బ్రెయిలీ లిపితో సామాన్యులకు దీటుగా అంధులు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. అనంతరం బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మహేశ్, శివకుమార్, అంజనేయులు పాల్గొన్నారు.

రేగోడుకు 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేయండి

● మంత్రి దామోదర్‌కు కాంగ్రెస్ నేతల వినతి



సంగారెడ్డిలో మంత్రి దామోదర్‌ను సన్మానించిన రేగోడు మండల కాంగ్రెస్ నాయకులు

రేగోడు, జనవరి 4: రేగోడుకు 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేసి, వైద్య సేవలు మెరుగుపరచాలని మండల కాంగ్రెస్ నాయకులు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కోరారు. సంగారెడ్డిలో గురువారం మండల నాయకులు మంత్రిని కలిసి, వినతిపత్రాన్ని అందజేశారు. రేగోడుకు 108 వాహనాన్ని అందజేయాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రేగోడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యామ్‌రావు కులకర్ణి, పీఏసీఎస్ డైరెక్టర్ నాగేందర్‌రావ్, రామాగౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకరప్ప, ప్రభాకర్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



వెల్దుర్తిలో ఎల్ఈడీ స్క్రీన్‌పై కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

వెల్దుర్తి, జనవరి 4: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీ ఆధ్వర్యంలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే కేంద్ర పథకాలకు సంబంధించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెల్దుర్తి గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ, ఈవో బలరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సెంట్రల్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



సీబీఆర్ఎం సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ భాగ్యలక్ష్మి

మనోహరాబాద్, జనవరి 4: బ్యాంకు రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని, సకాలంలో చెల్లించాలని చేయాలని మనోహరాబాద్‌లోని డీసీసీబీ మేనేజర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మనోహరాబాద్‌లోని డీసీసీబీ బ్రాంచీలో సీబీఆర్ఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంఘాలు రుణాలు తీసుకొని వ్యాపారాలు చేస్తూ అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ సమావేశంలో ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్, సీసీ శోభరాణి, కృష్ణవేణి, మండల సమైక్య అధ్యక్షురాలు స్వప్న, డీసీసీబీ బ్రాంచి అధికారి అరుణ్ పాల్గొన్నారు.

ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేసిన అధికారులు

కంది, జనవరి 4: మండలపరిధిలోని బ్యాతోల్ శివారులోని నక్కవాగు పరిసర ప్రాంతాల్లో కృత్రిమ ఇసుక ఫిల్టర్లను అధికారులు కూల్చివేయించారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో గురువారం ఆర్ఐ వెంకట్‌రాంరెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లి ఇసుక ఫిల్టర్లను కూల్చివేయించారు. కృత్రిమ ఇసుక ఫిల్టర్‌లకు ఉపయోగించే జాలీ, పీవీసీ పైపులు, పరికరాలను ధ్వంసం చేయించారు. అక్రమంగా తయారు చేసిన ఇసుకను ఆయన సీజ్ చేశారు.

ఘనంగా ఆలే భాస్కర్ జన్మదిన వేడుకలు



ఖేడ్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

నారాయణఖేడ్, జనవరి 4: బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్ జన్మదిన వేడుకలను గురువారం ఆ పార్టీ నాయకులు నారాయణఖేడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఖేడ్ ఏరియా ఆస్పత్రిలోపండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిరాం, బీజేపీ నాయకులు సంజీవ్, ఈశ్వరప్ప, సతీష్, సాయేందర్, ఏక్‌నాథ్, సంజీవ్‌యాదవ్, లోకేష్, సునీల్‌పాటిల్, హన్మంతు, అనిల్‌రెడ్డి, గోవింద్‌రావు, సాయిసాగర్ పాల్గొన్నారు.

సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

● నల్లవాగు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల



నల్లవాగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్/సిర్గాపూర్, జనవరి 4: రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. యాసంగిలో నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు భూములకు ఆరుతడి పంటల కోసం సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా గురువారం ఎమ్మెల్యే నీటిని విడుదల చేశారు. అనంతరం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యాసంగిలో కుడి, ఎడమ కాలువల ద్వారా 2,000 ఎకరాల ఆరుతడి పంటల సాగుకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకుని పంటలు పండించుకోవాలని సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు సాగునీటి సరఫరా పర్యవేక్షణ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపీడీవో సుజాత, సిర్గాపూర్ సర్పంచ్ స్వప్నశంకరయ్య, ఎంపీటీసీ పీరప్ప, మండల రైతుబంధు మాజీ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, మాజీ జడ్పీటీసీ రవి, నాయకులు శ్రీనివాస్‌రావ్, జయరాజ్, సాయిలు, నీటిపారుదల శాఖ డీఈఈ పవన్, ఏఈ సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతి కార్యక్రమం ప్రారంభం

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో మహిళలు ఉత్పత్తి చేసిన సరుకులను మార్కెటింగ్ చేసుకోవడంపై అవగాహన కల్పించేందుకు ఇందిరా క్రాంతి పథం ద్వారా ఏర్పాటు చేసిన ఉన్నతి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మిబాయిరవీందర్‌నాయక్, సేవాలాల్ సంఘంరాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కొమురయ్య, జిల్లా సమైక్య అధ్యక్షురాలు జ్యోతి, ఏపీఎంలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలి

గజ్వేల్, జనవరి 4: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆ వార్డు ప్రజలు డిమాండ్ చేశారు. వార్డులోని రోడ్డుపై నిలబడి గురువారం మహిళలు, ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి నుంచి గజ్వేల్‌కు వెళ్లే ప్రధాన లింకు రోడ్డు కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటున్నదని, ఆదివారం మార్కెట్ కావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని వాపోయారు. వ్యర్థ పదార్థాలు వర్షం నీటిలో కుళ్లిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న 3వ వార్డు ప్రజలు

కొమ్మూరిపై అసత్య ఆరోపణలు సిగ్గుచేటు

మద్దూరు, జనవరి 4: కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని, ఆత్మ పరిశీలన చేసుకుని వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మాజీ పీఏసీఎస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మద్దూరులో మండల నాయకులు మ్యాక మల్లేశం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ చేసిన అరాచకాలపై అన్నదమ్ముల్లా కలిసి చేర్యాల ప్రాంత సమస్యలపై పోరాటం చేసిన విధానాన్ని మర్చిపోయి ఈ ప్రాంతానికి నష్టం కలిగే విధంగా మాట్లాడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, మండల నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఊట్ల శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సందిటి లక్ష్మి, ముస్త్యాల మనోహర్, దామోదర్, గద్దల మహేందర్, తాళ్లపల్లి వీరేందర్, మెరుగు రమేష్ ఉన్నారు.

కొమ్మూరిపై విమర్శలు తగవు

చేర్యాల, జనవరి 4: గతంలో చేర్యాల ఎమ్మెల్యేగా రైతాంగం కష్టాలు తీర్చడంతో పాటు జనగామ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి చేసిన విమర్శలు తగవని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. గురువారం చేర్యాల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, దాసరి కళావతి మాట్లాడారు.